క్లుప్తంగా

మహాభారత యజ్ఞం ప్రారంభం



హరికథ చెబుతున్న కళాకారులు

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం ఆవరణంలో శనివారం మహాభారత యజ్ఞాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకృష్ణ లీలలు, కంచవథను ప్రారంభించారు. హరిదాసు కౌసల్యచే హరికథా కాలక్షేపం నిర్వహించారు.

ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు సూచనలిస్తున్న రాఘవరెడ్డి

నందలూరు (రాజంపేట) : పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్‌జేడీ రాఘవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వందశాతం ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత, ఉపాధ్యాయులు సుదర్శన్ రాజు, వీరారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, సుస్మిత, అమర్నాథ్, షఫీ, పవన్ కుమారి, జగన్, ప్రసాద్, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

బాధితులకు వరం సీఎంఆర్‌ఎఫ్



మస్తాన్ కుటుంబ సభ్యులకు చెక్‌ను అందజేస్తున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరంలాంటిదని జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి అన్నారు. వైద్యం వికటించి మరణించిన వారి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లాగడ్డకు చెందిన ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ కుటుంబసభ్యులకు రూ.5 లక్షల చెక్కును ఆకేపాటి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జాహీద్‌అలీ, మైనార్టీ నాయకులు దర్బార్, రహంతు, మస్తాన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ సమతామూర్తి



సంత్‌రవిదాస్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట రూరల్ : ఆధ్యాత్మిక కవి సంత్‌రవిదాస్ మహరాజ్ గొప్ప సమతామూర్తి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమేష్‌నాయుడు కొనియాడారు. ఆయన సూక్తులు అందరికీ మార్గదర్శకాలన్నారు. మండల పరిధిలోని అత్తిరాలలోని దళితవాడలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో సంత్‌ర విదాస్ 647వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప సంస్కర్త సంత్‌రవిదాస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిప్రసాద్, ఆదినారాయణ, నగేష్, నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏఐటీఎస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎల్లారెడ్డి

రాజంపేట : బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ సదస్సులో ప్రతిభ చాటినట్లు కళాశాల వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యానగర్, తిరుపతి జిల్లాలో శుక్రవారం ఇన్‌స్పిరాన్–2024 పేరిట నిర్వహించిన జాతీయ సదస్సులో తమ కళాశాల విద్యార్థులు కె. కృష్ణ రేవంత్, ఆర్. కిరణ్‌కుమార్‌రెడ్డి డిజైనింగ్ ఏ క్రాడిల్ సిస్టమ్ విత్ ఐఓటీ ఫంక్షనాల్టీ ప్రాజెక్టు ఎక్స్ పో నమూనాను ప్రదర్శించి, మొదటి బహుమతులు సాధించారని తెలిపారు.

ఇది పేదల ప్రభుత్వం

- పేదలు జీవన ప్రమాణాలు పెంచడమే సీఎం జగన్ ధ్యేయం
- భూ పంపిణీతో రైతులకు శాశ్వత ప్రయోజనం
- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : ఇది పేదల ప్రభుత్వమని, వారి జీవన ప్రమాణాలు పెంచడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం గాలివీడులో జరిగిన ఫ్రీ హోల్డ్ (2003 సంవత్సరానికి ముందు ఇచ్చిన డీకేటి పట్టాలకు రెగ్యులరైజేషన్) పట్టాల పంపిణీలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నా.. హక్కులు లేని రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం కలుగుతుందన్నారు. మండలంలో ఫ్రీ హోల్డ్ పట్టా లు, లబ్ధిదారులు 2,837, విస్తీర్ణం 6,310 ఎకరాలు, తొలి విడత అసైన్మెంట్ కమిటీకి సంబంధించి 118 పట్టాదారులకు గాను 141.3 ఎకరాలు విస్తీర్ణపు భూములకు చుక్కలు భూములు లబ్ధిదారులు 1,815 మంది, విస్తీర్ణం 1,986 ఎకరాలు, ఇనామ్ భూములకు సంబంధించి 604 మంది పట్టాదారులకు 547.15 ఎకరాలు విస్తీర్ణాన్ని రైతులకు పట్టాలుగా ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలో అసైన్మెంట్ కమిటీ రెండవ విడతలో 559 రైతులకు 773 ఎకరాలను పట్టాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు

గత ప్రభుత్వం భూ పంపిణీపై చొరవ చూపలేదన్నాదని ఆయన విమర్శించారు. 2004–2009 కాలంలో వైఎస్సార్ హయాంలో పేదలకు భూ పట్టాల పంపిణీ జరిగిందని, తరువాత ఒక ఏడాది భూ పట్టాల పంపిణీ జరిగిందని, తరువాత జరగలేదని తెలిపారు. ఇప్పుడు సీఎం జగన్ పాలనలో చారిత్రాత్మకంగా భూ పట్టాల పంపిణీ జరుగుతోందన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని శ్రీకాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. పేదలకు సంక్షేమం, అభివృద్ధి, ఆశ్రయం కల్పించడమే జగన్ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఉచిత విద్యుత్, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ, 108, 104 పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు హయాంలో శాశ్వత అభివృద్ధి పథకం ఏ ఒక్కటి లేదని విమర్శించారు. చంద్రబాబు మాటపైన నిలబడే వ్యక్తి కాదని మండిపడ్డారు. ఇప్పుడు భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఆయన ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం

జగనన్న పాలనలో సంక్షేమం విప్లవంలా కొనసాగుతోందని శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని 272 మంది వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి వలంటీర్లను సన్మానించారు. వలంటీర్లనందరినీ పేరు పేరునా పలకరిస్తూ పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాలు, నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు ఆసుపత్రుల అభివృద్ధి పనుల కళ్లకు కట్టినట్టుగా కనపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, మండల కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి, ఎస్‌కే ఖాదర్‌మోహిద్దీన్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి, గుమ్మా అమర్‌నాథరెడ్డి, సర్పంచ్ దీప్తి, ఉమాపతిరెడ్డి, కేశవరెడ్డి, ఉమా ప్రభాకర్, జానకమ్మ, జానకి రామాంజులురెడ్డి, బాబాపక్రుద్దీన్, నారాయణ, కృష్ణారెడ్డి, మల్లికార్జుననాయుడు, ఎంపీటీసీలు చిన్నారెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, షానవాజ్, అరుణ, అన్నపూర్ణమ్మ, మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి, మహిళా నాయకురాలు నాగేశ్వరమ్మ, సచివాలయం కన్వీనర్లు వెంకటాద్రి, హరినాథరెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ నగేష్, వాటర్ షెడ్ చైర్మన్ బసిరెడ్డి, రమణారెడ్డి, నాయకుడు బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

చిన్నమండెం: గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నమండెం మండలం బోనమల, దిగువగొట్టివీడు గ్రామాల్లో గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు రాష్ట్రాభివృద్ధికి ప్రమాణికాలుగా నిలిచాయన్నారు. సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచులు నజీర్ అహ్మద్, లక్ష్మీరెడ్డి, ముసల్ రెడ్డి, హేమనాథరెడ్డి, రాజమ్మ, వెంకటరమణ, ఉప సర్పంచ్ ఆనందరెడ్డి, ఎంపీటీసీలు ఏజాస్‌అలీఖాన్, శ్యామ్‌చంద్ర, శ్రీదేవి, నరసయ్యస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ అంజనప్ప, జేసీబీ శేఖర్, మురళి, రాజు, ఆనంద్, హసన్‌బాషా, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని తాకుతున్న రామ్మోహన్ దంపతులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ వేదికపై సతీసమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కల్యాణోత్సవంతో పాల్గొన్న రామ్మోహన్ దంపతులు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి పౌర్ణమి కల్యాణాన్ని వీక్షించేందుకు శ్రీశైలం పాలక మండలి సభ్యుడు రామ్మోహన్ నాయుడు సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి.. తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండ రామస్వామి వారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మళ్లీ కావాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.

వైభవంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ శివారులో పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ జ్యోతి సిద్దవటేశ్వరా స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీశైల దేవస్థానం ఆలయ పర్యవేక్షకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు లోక కల్యాణార్థం మాఘ శుద్ధ పౌర్ణమి రోజు శనివారం రాత్రి స్వామి వారికి గణపతిపూజ, మహన్యాసక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, కంకణధారణతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకకు వచ్చిన భక్తులకు స్థానిక వైఎస్సాఆర్‌సీపీ నాయకుడు పి. రవిశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిన్నపురెడ్డి సుబ్బమ్మ, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు జ్యోతి లక్ష్మిరెడ్డి, శివకుమార్ రెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన తప్పనిసరి



శిక్షణలో మాట్లాడుతున్న నోడల్ అధికారులు

రాయచోటి : పోస్టల్ బ్యాలెట్ పేపర్లపై అసెంబ్లీ స్థాయి నోడల్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నోడల్ అధికారులు వెంకటేశ్వర్‌రెడ్డి, ధనలక్ష్మీ, రవి ప్రసాద్, జయరాముడు సూచించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, ఈటీపీబీఎస్‌లపై అసెంబ్లీ స్థాయి నోడల్ అధికారులకు ఎన్నికల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ల నోడల్ అధికారి రవిప్రసాద్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్లను అత్యంత గోప్యంగా నిర్వహించాలన్నారు. 80 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్లకు మొబైల్ పోస్టల్ బాక్సులు నిర్వహించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ప్రజల సమస్యలు వింటున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు వినతిపత్రాలు అందించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అప్పటికప్పుడు సంబంధింత అధికారులకు ఆదేశాలు ఇచ్చి సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి

పట్టణంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శనివారం కోడూరు పట్టణంలో అంబేడ్కర్ నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెట్పీటీసీ రత్నమ్మ, రాజగోపాల్, ఆంజనేయులు, రాజేంద్ర, శారదమ్మ, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, చంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవతా సేవలు అభినందనీయం



బాడీ ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మానవతా సేవలు అభినందనీయమని మాజీ రెస్కో చైర్మన్ చదిపిరాళ్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక నలందా విద్యానికేతన్ హైస్కూల్‌లో బాడీ ఫ్రీజర్‌ను మానవతా సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లిలో త్వరలోనే మానవతా ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మానవతా సభ్యులు కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యం, వైస్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, మానవతా కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి, మానవతా అధ్యక్షుడు వివి రమణరావు, కార్యదర్శి రాముడు, రామాంజనేయులు, చైతన్య రెడ్డి, పక్కీరయ్య, శివయ్య, సాయి చరణ్, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆత్మబంధువు సీఎం జగనన్న



మంజునాథ్‌కు ఎల్‌ఓసీ చెక్‌ను అందజేస్తున్న వేణుగోపాలరెడ్డి

రాజంపేట రూరల్ : ఆపదలో ఉన్న వారందరినీ ఆదుకుంటూ వారికి ఆత్మబంధువుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఏపీఐఐసీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. పట్టణంలోని ఏబీఎస్‌ఆర్ కాలనీలోని కార్యాలయంలో శనివారం లివర్ ప్లాంటేషన్ కోసం రూ.17 లక్షల ఎల్‌ఓసీ చెక్‌ను కోడూరు మంజునాథ్‌కు తంబెల అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిదిలోని సీతారామపురం గ్రామానికి చెందిన కోడూరు శివ కుమారుడు, మంజునాథ్‌కు లివర్ ప్లాంటేషన్ అవసరమని వైద్యులు తెలిపారన్నారు. ఇదే విషయాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవల్సిందిగా కోరామని తెలిపారు. ఎంపీ చొరవతో మంజునాథ్‌కు రూ.17 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సకాలంలో తమ కుంటుబాన్ని ఆదుకున్న ఎంపీ మిథున్‌రెడ్డికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఋణపడి ఉంటామని మంజునాథ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అడవులను నిప్పు నుంచి కాపాడుదాం

- ఉద్దేశపూర్వకంగా అడవులను తగలబెడితే కఠిన చర్యలు
- మార్చి మొదటివారంలో నగరవనం ప్రారంభం
- సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు

మదనపల్లె : పచ్చదనంతో పరవశింపజేసే అడవులను కార్చిచ్చుకు బలిచేయడం తగదు. అడవులను నిప్పు నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని సబ్ డివిజన్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎఫ్‌ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ...మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో మదనపల్లె, పీలేరు, సానిపాయ, రాయచోటి అటవీప్రాంతాలు వస్తాయన్నారు. ఇటీవల కాలంలో మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటుండటం బాధాకరమన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. దేశవ్యాప్తంగా అడవుల శాతం 33 శాతం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 22 శాతం మాత్రమే ఉందన్నారు. అటవీ ప్రాంత సమీపంలోని పంటపొలాల్లోని వ్యర్థాలను రైతులు తగులబెట్టేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోవడం, పశువులు, గొర్రెల కాపరులు అడవుల్లోకి వెళ్లి జీవాలకు మేత కావాలని నిప్పు పెడుతున్నారన్నారు. కొంతమంది తెలిసో, తెలియక, ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టడం తదితర దుందుడుకు చర్యలతో అడవిని నమ్ముకుని జీవిస్తున్న జంతువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అడవులకు నిప్పు పెట్టడంతో అటవీ ప్రాంతాల్లోని చెట్లు చిగురించకపోవడం, ఫలసాయం దక్కకపోవడం, జంతుజాలం నశించిపోవడం తదితర విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. అటవీ పరిసర ప్రాంత ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం అడవులు కాపాడటం మనందరి బాధ్యతన్నారు.

వాలంటీర్లు పేదలపాలిట సేవారత్నాలు

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

నందలూరు (రాజంపేట) : పేదలకు ప్రభుత్వ సేవలు అందించడంలో వాలంటీర్లలందరూ సేవా రత్నాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మండల పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లకు వాలంటీర్లు వందనం కార్యక్రమాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సేవా భావంతో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న సంక్షేమ ప్రభుత్వ పథకాలు వాలంటీర్ల ద్వారా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలు తీర్చడానికి దేశ చరిత్రలో మొదటిసారి వాలంటీర్ వ్యవస్థతో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం వాలంటీర్లను శాలువా, మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, సీనియర్ నాయకులు భూమన శివశంకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల శ్రీనాథ్, జేసీఎస్ కన్వీనర్ కరీముల్లా ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సౌమ్యనాథ ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైస్ ఎంపీపీ అనుదీప్, ఉప సర్పంచ్ ఇబ్బు, నాయకులు పెనుబాల నాగసుబ్బయ్య, అరిగె మణి, కాకి చంద్ర, ఆనాల మధు యాదవ్ పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు మరువ లేనివి

సిద్దవటం : రాష్ట్రంలో వాలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు మరువలేమని మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రశంసించారు. సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం సేవా వజ్రం, సేవారత్న, సేవా మిత్రలకు ఎంపికైన గ్రామ వాలెంటీర్లకు శాలువా కప్పి, ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు అందించే విషయంలో వాలంటీర్లు కీల పాత్ర పోషించారని తెలిపారు. అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన 2 ఏళ్లలోనే పూర్తి చేశారన్నారు. వాలంటీర్లు జగనన్న ప్రభుత్వానికి పట్టుకొమ్మలని ఆయన కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, రైతు విభాగం మండల కన్వీనర్ సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవహర్‌బాష, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు గోపాల స్వామి, వెంకటసుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నయూబ్‌రసూల్, పార్టీ నాయకులు కె.వి. సుబ్బయ్య, కృష్ణచైతన్య, వెంకటసుబ్బారెడ్డి, జ్యోతి లక్ష్మిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు చెల్లించి సహకరించండి

రాయచోటి టౌన్ : వినియోగదారులు విద్యుత్ సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని రాయచోటి విద్యుత్ శాఖ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం కూడా రాయచోటి డివిజన్ పరిధిలోని విద్యుత్ చార్జీల వసూళ్ల కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలని కోరారు.

27న సంగీత పోటీలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని మిషన్ స్కూల్ ఆవరణలో ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని సంగీత కళాసంస్థ నిర్వాహకుడు దాసరి చంద్రయ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న రాగాలాపన సంగీత పోటీలు నిర్వహించనున్నారు. శనివారం చంద్రయ్య మాట్లాడుతూ ఆసక్తి ఉన్న సంగీత కళాకారులు, గాయకులు పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఘంటసాల పాడిన పాటలు మాత్రమే పోటీల్లో పాడాలని తెలిపారు.

సింధూర అలంకరణలో భైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని భైరవగుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా ఆలయ పాలక మండలి సభ్యుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని సింధూరంతో ప్రత్యేక అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు రాజంపేటకు ఎంపీ

రాజంపేట : మేడా రఘునాథరెడ్డి రాజ్యసభ సభ్యుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా రాజంపేటకు ఆదివారం రానున్నారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 1 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం 3 గంటలకు మేడా భవన్‌కు చేరుకోనున్నారు. రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డితో కలిసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు అందుబాటులో ఉంటారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



వెన్నశాతాన్ని పరిశీలిస్తున్న డీడీ, మిల్క్ ఇన్‌స్పెక్టర్లు

చిట్వేలి : ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట ఉప సంచాలకులు ఎర్రంశెట్టి విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా డైరీలు, పాలసేకరణ కేంద్రాల నిర్వహణలో భాగంగా ప్రభుత్వం ఏపీ మిల్క్ యాక్ట్–2023లో ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. గట్టుమీదపల్లిలోని జెర్సీ డైరీలో శనివారం ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ వరప్రసాద్, చిట్వేలి, పెనగలూరు పశువైద్యులతో కలిసి విజయభాస్కర్ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలలోని వెన్నశాతాన్ని పరిశీలించారు. వెన్నశాతం నిర్ధారణకు ఉపయోగిస్తున్న ల్యాబ్ రసాయనాలను వాటి నాణ్యతను పరిశీలించారు. మార్చి 10వ తేదీలోగా ప్రతి అనలైజర్ విధిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. తీసుకోకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ నాయక్, శివ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్యాన సప్తాహ మహాసభలు

రాయచోటి అర్బన్ : నేడు (ఆదివారం) నుంచి మార్చి 2వ తేదీ వరకు పట్టణంలో ధ్యాన సప్తహ మహాసభలను నిర్వహిస్తున్నట్లు దిరాచవీడు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు డి.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్‌యన్ కాలనీ సాయిబాబా దేవస్థానంలో ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి 8.30 గంటల వరకు సభలు నిర్వహిస్తామని తెలిపారు.

భగవద్గీత పోటీలు : ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజున పట్టణంలో భగవద్గీత పారాయణం పోటీలు నిర్వహిస్తున్నట్లు సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సాయి బాబా దేవాలయంలో పోటీలు నిర్వహింపబడతాయన్నారు. 7 నుంచి 11 సంవత్సరములు, 12 నుంచి 18 సంవత్సరముల వయస్సు గల పిల్లలకు వేర్వేరుగా భగవద్గీతలోని 8 అధ్యాయాల్లోని 3,4 శ్లోకముల ఉచ్చారణ, రాగము, లయ, భావ వివరణపై పోటీలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన పిల్లలు పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆకస్మిక తనిఖీ



విద్యుత్ స్తంభాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రమణ

సిద్దవటం : సిద్దవటం శివారులోని విద్యుత్ స్తంభాల తయారీ కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశామని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాణాలు పాటించి స్తంభాలను పటిష్టంగా తయారు చేయాలని ఆదేశించామన్నారు. భద్రత నియమాలను విధిగా పాటించాలని తెలిపారు. విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో విద్యుత్ స్తంభాలు కీలకంగా వ్యవహరిస్తాయని అన్నారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని అన్నారు. సిద్దవటం ఏఈ జయచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.